వీక్లీ రైలుగా తిరువణ్ణామలై ఎక్స్‌ప్రెస్ సేవలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: నరసాపురం- అరుణాచలం (తిరువణ్ణామలై) ఎక్స్‌ప్రెస్ రైలు ఇకపై పూర్తిస్థాయి రెగ్యులర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌గా సేవలందించనుంది. బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు భీమవరం టౌన్ రైల్వే స్టేషన్‌లో ఈ రైలును కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ ప్రారంభించనున్నారు. ఈ రైలు నరసాపురంలో బయలుదేరి పాలకొల్లు, వీరవాసరం, భీమవరం జంక్షన్, టౌన్, ఆకివీడు, గుడివాడ, విజయవాడ మీదుగా తిరువణ్ణామలై చేరుకుంటుందని రైల్వేశాఖ అధికారులు వెల్లడించారు.

నాగర్‌సోల్ - నరసాపూర్ రైలు నియంత్రణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని నాందేడ్ డివిజన్‌లో పనుల నిర్వహణ కారణంగా సెప్టెంబరు 29 వరకు నాగర్‌సోల్ - నరసాపూర్ (12788) రైలును నాగర్‌సోల్, జల్నా వద్ద 50 నిమిషాల పాటు నిర్ణీత తేదీల్లో నియంత్రించనున్నట్లు (రెగ్యులేషన్) విజయవాడ డివిజన్ పీఆర్వో నస్రత్ ఎం.మండ్రూప్‌కర్ ఒక ప్రకటనలో తెలిపారు. మరో రైలు నాగర్‌సోల్ - నరసాపూర్‌ను (17232) కూడా నియంత్రించనున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు. జులై 1 నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - నరసాపూర్ (20677) వందేభారత్ రైలును నెల్లూరు స్టేషన్లో నిలుపుదల చేయనున్నట్లు తెలియజేశారు.

పెట్రోలు బంకులో నకిలీ కరెన్సీ కలకలం

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలంలోని కన్నాపురం కూడలిలో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పెట్రోలు బంకులో మంగళవారం ఉపాధి శ్రామికుడికి నకిలీ రూ.100 నోటు ఇవ్వడంతో కలకలం రేగింది. అతడు వాహనంలో రూ.150 పెట్రోలు కొట్టించుకుని రూ.500 నోటు ఇవ్వగా.. బంకు సిబ్బంది ఇచ్చిన సొమ్ములో రూ.100 నకిలీ నోటు ఉన్నట్లు గుర్తించి నిలదీశారు. దానిపై వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి సిబ్బంది మరో వంద నోటు ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

తాకట్టు పడుతున్నారు.. పొట్ట కొడుతున్నారు..

ఆగిరిపల్లి, నూజివీడు, న్యూస్‌టుడే: బంగారం తాకట్టు పెట్టే వ్యాపారం ఉమ్మడి జిల్లాలో జోరుగా సాగుతోంది. పేదల అవసరమే పెట్టుబడిగా, ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని, వడ్డీలపై వడ్డీలు వసూలు చేస్తూ వ్యాపారులు దోపిడీ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు బంగారం తాకట్టు పెట్టుకునే వ్యాపారుల ఉచ్చులో పడి వడ్డీలు చెల్లించుకోలేక విలవిల్లాడుతున్నారు. చివరకు విలువైన బంగారం కోల్పోతున్నారు.

- ఆగిరిపల్లి మండలం నూగొండపల్లికి చెందిన ఓ రైతు మూడేళ్ల క్రితం ఆగిరిపల్లికి చెందిన ఓ దుకాణదారుడి వద్ద 25 గ్రాముల బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.32 వేలు రుణంగా తీసుకున్నారు. ఏడాదిన్నర క్రితం రూ.30 వేలు తిరిగి చెల్లించారు. అప్పటి నుంచి తన వస్తువులు కావాలని మిగిలిన రుణం చెల్లిస్తానని చెబుతున్నా దాటవేస్తూ వచ్చారు. తాజాగా సోమవారం రాత్రి ఆ రైతు తనఖా పెట్టిన దుకాణం వద్దకు వచ్చి తన ఆభరణాలు ఇవ్వాలని బైఠాయించడంతో కలకలం రేగింది. ఇంకా రూ.1.38 లక్షలు నగదు చెల్లిస్తే 15 గ్రాములు విలువైన బ్రాస్‌లెట్ మాత్రమే ఇస్తామని, 10 గ్రాముల ఉంగరాలు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పినట్లు బాధితుడు వాపోయాడు.
- అంతకు ముందు అదే దుకాణదారుడు 20 గ్రాముల విలువైన రెండు బంగారు ఆభరణాలు తనఖా పెట్టుకుని రూ.24 వేలు రుణం ఇచ్చి దానికి రూ.70 వేలు నగదు వసూలు చేశాడని రైతు వాపోయాడు. ఇలాంటి ఘటనలు గ్రామీణ ప్రాంతాల్లో నిత్య కృత్యమయ్యాయి.
- ఆగిరిపల్లి మండలంలో పెద్ద ఎత్తున దొంగ బంగారం కొనుగోలు, బంగారం తనఖా వ్యాపారాలను అక్రమంగా నిర్వహిస్తూ పేదల జేబులు గుల్ల చేస్తున్నారు. అప్పులు తీర్చడానికి ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- అత్యవసర సమయాల్లో అప్పులు చేయడం తప్పనిసరి. అయితే బయట వ్యాపారస్తులు అధిక వడ్డీతో చాలా సులభంగా రుణాలు ఇచ్చి వారి అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు.

ఆభరణాలు విడిపిస్తామంటూ దండా.. బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలను పేద, దిగువ మధ్య తరగతి వారు నిర్ణీత గడువులోగా తీర్చలేకపోవడం కొందరు వ్యాపారులకు వరంగా మారింది. వడ్డీ సహా రుణం మొత్తం చెల్లించి బంగారం విడిపిస్తామంటూ పలు ప్రైవేటు వ్యాపార సంస్థలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. కొద్ది మంది బ్యాంకుల నుంచి విడిపిస్తున్న బంగారాన్ని తమ వద్దే పెట్టుకుంటున్నారు. ఒక వేళ అప్పు తిరిగి చెల్లించకపోతే ఆ బంగారం వ్యాపారుల పరమవుతోంది.

బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేయొచ్చు..

పేదల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమంగా బంగారం తనఖా పెట్టడం, వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రజలను ఇబ్బందులు పెట్టేవారిపై, మోసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలి. **-కేవీవీఎన్‌వీ ప్రసాద్, డీఎస్పీ నూజివీడు.**

- జోరుగా బంగారం తనఖా దందా!
- పేదల అవసరమే పెట్టుబడి

ఉద్యోగ విరమణ చేసిన పోలీసు అధికారులను సత్కరించిన ప్రతాప్ శివకిశోర్

సమర్థ సేవలు అభినందనీయం : ఎస్పీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: సమర్థ సేవలు అభినందనీయమని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. పోలీసు శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పలువురిని ఏలూరులోని ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ వారి సేవలను కొనియాడారు. స్పెషల్ బ్రాంచ్ ఎస్సై మక్బుల్, ఎస్పీ కార్యాలయ ఎస్సై కేశవరావు, త్రీటౌన్ ఎస్సై అజయ్ కుమార్, సీసీఎస్ ఎస్సై సైమన్, ఏఎస్సైలు వీరాస్వామి, ప్రసాద్, శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఉన్నారు.

'సర్' డిజిటలైజేషన్‌లో వెనుకబడితే తాకీదులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా సవరణ(సర్)కు సంబంధించి ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్‌లో వెనుకబడే అధికారులకు తాకీదులు జారీ చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి హెచ్చరించారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో మంగళవారం కలెక్టరేట్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్‌ను బుధవారం నాటికి 40 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

- సర్ ప్రక్రియను గడువు నాటికి పూర్తి చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ పవన్ కుమార్‌శర్మ మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న వెట్రిసెల్వి మాట్లాడుతూ 'సర్' ప్రక్రియను ప్రణాళికాయుతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి 'వీబీ-జీ రామ్‌జీ' అమలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరించడం, పేద కుటుంబాలకు జీవనోపాధి కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఏడాదికి 125 పనిదినాలు కల్పించడం లక్ష్యంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని జులై 1 నుంచి 'వికసిత్ భారత్-గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్' (వీబీ-జీ రామ్‌జీ) పేరుతో అమలు చేయనున్నట్లు డ్వామా పీడీ కేవీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం జులై ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందన్నారు. జాతీయ స్థాయిలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జులై 2వ తేదీ ఉదయం 11 గంటలకు తిరుపతిలో నిర్వహించనున్నారని తెలిపారు. అదేరోజు ఉదయం 11 గంటలకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలియజేశారు.

3 నుంచి రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జులై 3, 4, 5 తేదీల్లో ఏలూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏలూరులోని అల్లూరు సత్యనారాయణ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 3న మధ్యాహ్నం 3 గంటలకు జూట్‌మిల్లు సెంటర్ నుంచి హలో రైతన్న.. చలో ఏలూరు.. పేరుతో రైతు మహా ప్రదర్శన, అనంతరం ఇండోర్ స్టేడియంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. 4, 5 తేదీల్లో డీసీఎంఎస్ హాలులో ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభల్లో రాష్ట్రంలోని రైతుల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు.

యాప్‌లో వివరాల నమోదు తప్పనిసరి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఏలూరు అర్బన్ ప్రాజెక్టు పరిధిలోని 41 డివిజన్‌లో రహమత్‌నగర్, జయప్రకాష్ సెంటర్ అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా, శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ రీజనల్ డైరెక్టర్ బి.సుజాత మంగళవారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం చేపట్టిన నవ చేతన స్క్రీనింగ్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి కార్యకర్త విధిగా ఈ యాప్‌లో అన్ని వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏలూరు సీడీపీవో ఎ.పద్మావతి, ఈవో మౌనిక, అంగన్‌వాడీలు, తల్లులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ విధానంపై ఆరా తీస్తున్న సుజాత

ఉచిత న్యాయ సేవలపై అవగాహన

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఏలూరు కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో శాశ్వత లోక్‌అదాలత్, న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే ఉచిత సేవలపై శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్‌కుమారీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీరు మాట్లాడుతూ రవాణా, తపాలా, బీమా, టెలికమ్, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, పనికి ఆహార పథకం, బాధితులకు, ముద్దాయిలకు న్యాయవాదిని ఏర్పాటు చేయటం వంటి సేవలను ఉచితంగా అందిస్తామని చెప్పారు. కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం నిర్వహిస్తామన్నారు. జులై 11న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు, వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమార్

జీడీపీ వృద్ధిలో పారిశ్రామిక ప్రగతి కీలకం

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా జీడీపీ అభివృద్ధిలో పారిశ్రామికాభివృద్ధి ఎంతో కీలకమని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో పారిశ్రామికవేత్తల పాత్ర ముఖ్యమన్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం జులైలో మెగా పారిశ్రామికవేత్తల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో అభివృద్ధి సూచికలో జిల్లా ముందు స్థానంలో ఉండటంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. అనంతరం పలువురు పారిశ్రామికవేత్తలు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో నైపుణ్యం కలిగిన కార్మికుల కొరత ఉందని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ఏ విభాగాల్లో కార్మికులు అవసరమో తెలియజేస్తే అటువంటి వారిని గుర్తించి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఆయా విభాగాల్లో శిక్షణ ఇస్తామని చెప్పారు. అనంతరం పారిశ్రామికాభివృద్ధిలో భాగస్వాములైన వి.కిరణ్‌కుమార్, జి.సాయి సత్యవరప్రసాద్, ఎస్.సోనీ, బీఎస్ రెడ్డి, సీహెచ్ ఏసుపాదం తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం ఆర్.వెంకటరావు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామిక వేత్తలను సత్కరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

పొగాకు రైతులకు నష్టం రానివ్వం

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు రైతులకు నష్టం రాకుండా సానుకూల ఫలితాలు వచ్చేలా కృషి చేస్తున్నట్లు పొగాకు బోర్డు ఈడీ బి.విశ్వశ్రీ పేర్కొన్నారు. కొయ్యలగూడెం వేలం కేంద్రాన్ని ఆమె మంగళవారం సందర్శించి వేలాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో చర్చించి ఏ రకం పొగాకుకు ఎంత ధర వస్తుందని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ అన్ని గ్రేడుల పొగాకును కొనుగోలు చేసే విధంగా ట్రేడర్లతో చర్చలు జరుపుతామన్నారు. రైతులు మార్కెట్‌ను అంచనా వేసి ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న గ్రేడులను వేలానికి తీసుకురావాలని సూచించారు. వచ్చే ఏడాదికి సంబంధించి ఎన్ఎల్ఎస్ ప్రాంతంలో 80 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తికి పరిమితి నిర్ణయించారని వెల్లడించారు. వేలం విభాగం మేనేజరు కె.రామాంజనేయులు, రీజినల్ మేనేజరు సురేంద్రకుమార్, వేలం నిర్వహణాధికారి శివకుమార్, రైతు సంఘం అధ్యక్షుడు కాకర్ల వివేకానంద రైతులు పాల్గొన్నారు.

వేలాన్ని పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ, మేనేజరు రామాంజనేయులు

క్రమశిక్షణ, సేవా భావంతో నాయకత్వ లక్షణాలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు, పాఠశాల, కళాశాల స్థాయిల్లో క్రమశిక్షణ, సేవాభావం కలిగి బాధ్యతలు పంచుకోవడం ద్వారా నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి ఆంధ్ర వంశీ అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ పాఠశాల మంగళవారం నిర్వహించిన విద్యార్థుల పదవీ స్వీకరణ వేడుక(ఇన్వెస్టిచర్ సెర్మనీ)లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 900 మంది విద్యార్థుల వసతులు బాగున్నాయని అన్నారు. వేలాది మంది విద్యార్థులకు 33 ఏళ్లుగా ఉచిత విద్య, వసతి, వైద్యంతో కూడిన సేవలు అందిస్తున్న 'హీల్' సంస్థ అభాగ్య బాలల పాలిట వెలుగు దీపమని తెలిపారు. అనంతరం హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో అనుమోలు ఈశ్వర సాయి విరాళంతో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఐశ్వర్య ప్రియకు, హీల్ వితరణతో పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఆరుగురు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లను అందజేశారు. కార్యక్రమంలో హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మి, డైరెక్టర్లు ఎం.రంగప్రసాద్, వై.బాలాజి, అంకమ్మ చౌదరి, సీఈవో కె.అజయ్‌కుమార్, ప్రిన్సిపల్ కె.కవిత, వైస్ ప్రిన్సిపల్ ఎం.హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకులతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి వంశీ, హీల్ ప్రతినిధులు

గందరగోళంగా డివిజన్ల పునర్విభజన

స్టే విధించిన హైకోర్టు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు నగరంలో డివిజన్ల పునర్విభజన గందరగోళంగా మారింది. దీని కోసం సిద్ధం చేసిన మ్యాప్‌లో ప్రతి డివిజన్ సరిహద్దు గుర్తించగా ఆయా డివిజన్లలో చేర్చిన డోర్ నంబర్లకు మ్యాపులోని డివిజన్లకు మధ్య పొంతన కుదరటం లేదు. కొన్ని డోర్ నంబర్లను ఏ డివిజన్‌లోనూ చూపలేదని ఆరోపణలున్నాయి. వార్డుల పునర్విభజన సహేతుకంగా జరగలేదని కొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఏలూరు నగరంతో పాటు రాష్ట్రంలోని గుంటూరు, ఒంగోలు, ధర్మవరం, కడప, రాయచోటి పరిధిలోని డివిజన్లు, వార్డుల పునర్విభజనపై హైకోర్టు స్టే విధించింది. దీంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది.

నిబంధనలకు విరుద్ధంగా.. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో 50 డివిజన్లు ఉండగా పునర్విభజన తర్వాత 62కు చేరింది. ఈ ప్రక్రియ సరిగా జరగలేదని న్యాయస్థానం స్టే ఇవ్వడంతో నేతల్లో తర్జన భర్జన జరుగుతోంది. పురపాలక శాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం నగరంలో ఉత్తర దిక్కు నుంచి తూర్పు, దక్షిణం, పడమర దిశల మీదుగా డివిజన్ల పునర్విభజన చేపట్టాలి. ఉత్తరం నుంచి మొదలు పెట్టి సవ్య దిశలో డివిజన్లు విభజించాలి. దానికి భిన్నంగా డివిజన్లు ఏర్పాటు చేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి సంబంధించి పలు అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో పునర్విభజన ప్రక్రియ వాయిదా పడినట్లు నగరపాలక సంస్థ వార్డు ప్రణాళిక విభాగానికి చెందిన అధికారి తెలిపారు.

ఆ డాక్యుమెంట్ ఎవరు షేర్ చేశారు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అధికార పార్టీ నాయకుడు ఒకరు కొందరి నుంచి వసూళ్లకు పాల్పడినట్లు వారి పేర్లతో ఒక డాక్యుమెంట్ తయారు చేసి ఆ పార్టీలోని కొందరికి షేర్ చేశారు. దీన్ని ఓ విశ్రాంత అధికారి, మరో వ్యక్తి కలిసి తయారు చేసి ఓ మహిళా కార్పొరేటర్‌కు అందజేయగా.. ఆమె సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. దీనిపై ఆ మహిళా కార్పొరేటర్‌ను పిలిచి విచారించారు. ఆ డాక్యుమెంట్‌లో పేర్లు ఉన్న వ్యక్తులు పోలీసుల ముందుకు వచ్చి తాము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని చెప్పారు.

కలెక్టర్ దృష్టికి పోలవరం సమస్యలు తీసుకెళ్లా: మంత్రి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బోడిగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ట్రైకార్‌సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు భార్య ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం రామయ్యపేట పునరావాసకాలనీ వద్ద నిర్వాసితులతో ముచ్చటించారు. తమ ప్రాంతంలో విద్యుత్తు స్తంభాలు, దీపాలు లేవని, గతంలో 18 సంవత్సరాలు నిండిన యువకులకు స్థలాలు ఇచ్చారుగాని ఇళ్లు మంజూరు చేయలేదని వాపోయారు. ప్యాకేజీలో రాకపోతే కాలనీల్లో ఇళ్లు మంజూరు చేస్తానని మంత్రి వారికి భరోసా ఇచ్చారు. అక్కడ నుంచే మంత్రి ఏపీఈపీడీసీఎల్ అధికారులతో మాట్లాడి స్తంభాలు వేసి దీపాలు అమర్చాలని ఆదేశించారు. యూరియా సరఫరాపై కోత విధించడంతో ఇబ్బందులు పడతామని కొత్తపట్టి సీమ సొసైటీ అధ్యక్షుడు పూడి వెంకట్రావు, ఇసుక కాలువ గండ్లు పూడ్చకపోవడంతో పొలాలు దెబ్బతింటున్నాయని నీటిసంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్ వివరించారు. మంత్రి అక్కడ నుంచే కలెక్టర్‌తో మాట్లాడి గండ్లు పూడ్చటానికి ఏదొక గ్రాంటు నుంచి నిధులు మంజూరు చేయాలని సూచించారు.

సమావేశంలో మంత్రి పార్థసారథి, తెదేపా జిల్లా అధ్యక్షుడు బడేటి చంటి, నాయకులు

పార్టీ బలోపేతానికి కృషి

కూటమి ప్రభుత్వం పోలవరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటుందని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పోలవరంలోని ప్రైవేట్ అతిథిగృహంలో మంగళవారం ట్రైకార్ సంస్థ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన తెదేపా ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు ఎమ్మెల్యే, జిల్లా తెదేపా అధ్యక్షుడు బడేటి చంటి, చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీకృష్ణ, కైకలూరు ఇన్‌ఛార్జి వీరమల్లు నరసింహరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. తొలుత మంత్రి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

సకల వసతుల గృహాలు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుకునే విద్యార్థులకు కూటమి సర్కారు ప్రత్యేక సదుపాయాలను, సౌకర్యాలను కల్పిస్తోంది. చదువుతో పాటు ఉద్యోగాలు కల్పిస్తామన్న భరోసాను ఇస్తోంది. గతంలో ఎన్నడు లేని విధంగా ఈ సారి విద్యార్థులకు నైట్ డ్రెస్‌లు, చలి కోట్లు, దుప్పట్లు, కార్పెట్, టర్కీ టవళ్లు సమకూర్చుతోంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాటు విద్యార్థుల బాగోగులను గాలికొదిలేసింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తరువాత తాగు నీరు, భోజన వసతులు మెరుగు పరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. గత ఏడాదే రూ.కోట్లు వెచ్చించి వసతి గృహాలకు మరమ్మతులు చేయించి సిద్ధం చేసింది. విద్యార్థులుండే ప్రతి గదిలో ఫ్యాన్లు ఏర్పాటు చేసింది. తాగు నీటి కోసం కూలర్లను సరఫరా చేసింది. మరుగుదొడ్ల సమస్య పరిష్కరించింది. దోమలకు ఆస్కారం లేకుండా వసతి గృహాల కిటికీలకు మెష్‌లను ఏర్పాటు చేసింది.

నైట్ డ్రస్‌లతో విద్యార్థులు

ఆశ్చర్యచకితులైన చిన్నారులు

పాఠశాలల పునఃప్రారంభం తరువాత వసతి గృహాలకు వచ్చిన విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ చేస్తే ఆనందంతో పాటు ఆశ్చర్య చకితులయ్యారు. జిల్లాలో 57 వసతి గృహాల్లో 4,962 మంది విద్యార్థులున్నారు. నూజివీడు డివిజన్ పరిధిలో 9 వసతి గృహాలు ఉండగా 900 మంది విద్యార్థులకు వీటిని సరఫరా చేస్తామని ఏఎస్‌డబ్ల్యూవో శ్రీనివాసరావు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -148 రిటైల్ ధర 175 చికెన్ విత్ స్కిన్ - 271 చికెన్ స్కిన్‌లెస్ - 306.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 160, 169, 180 చికెన్ విత్ స్కిన్ - 310 చికెన్ స్కిన్‌లెస్ - 320.

పార్టీ పదవుల కోసం దరఖాస్తుల స్వీకరణ

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: జనసేన పార్టీ నిర్మాణ ప్రక్రియ కోసం చేపట్టిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కార్యక్రమం ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. రెండో రోజు మొదలైన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏలూరు, దెందులూరు, పోలవరం, నూజివీడు, చింతలపూడి, కైకలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల పరిధిలో సమాచార సేకరణ చేపట్టారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు, రాజానగరం ఎమ్మెల్యే బలరామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కోసం బలంగా నిలబడ్డ క్షేత్రస్థాయి నాయకులు, శ్రేణులు తాము ఆశించే పదవుల వివరాలను తెలియజేస్తూ కమిటీకి అందజేసిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, పరిశీలకుడు బలరామకృష్ణ మాట్లాడుతూ దరఖాస్తులను స్వయంగా పరిశీలించి కావాల్సిన పత్రాలు సక్రమంగా ఉన్న వాటిని ఐటీ విభాగానికి అందించామని చెప్పారు. నియోజవకర్గం ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

పత్రాలు తీసుకుంటున్న బలరామకృష్ణ

92.7 FM Rajamahendravaram ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

| కార్యక